క్లుప్తంగా

పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : గర్భిణులను గుర్తించి వారికి బర్త్ ప్లానింగ్ గురించి తెలియజేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రయాణ సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం మందుల విభాగాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ (ఎస్ఆర్ఎస్) బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాలన్నారు. సిబ్బంది, వైద్యుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. మలేరియా పరీక్షలు సరిగా చేయాలని టెక్నీషియన్లకు సూచించారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, ప్రసవానంతరం సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంపీహెచ్ఈలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సీపీ అభినందన



ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

మహారాణిపేట: రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో 44 రోజుల పాటు బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ కోర్సు శిక్షణ పూర్తి చేసిన ఆర్ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లను నగర పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అభినందించారు. శనివారం ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు చెందిన ఆర్ఎస్ఐ కె.రామ్మోహనరావు, కానిస్టేబుళ్లు డి.నూకరాజు, టీజీ మహేశ్వరరావు, మహిళా కానిస్టేబుళ్లు టి.శాంతి, జి.మణి సీపీ శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీకి ట్రెనింగ్ జరిగిన విధానాన్ని, సాధించిన మెమెంటోలను, గ్రేడ్ సర్టిఫికెట్లను చూపించారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బందిని అభినందించారు. వీరు ఏలూరులో ఇచ్చిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని నగరానికి చేరుకున్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ ఆల్ రౌండర్, ఉత్తమ గ్రేడ్లు సాధించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు (ఏఆర్) ఆర్‌పీఎల్ శాంతికుమార్, ఎ.రాఘవేంద్రరావు, ఆర్ఐ సీతారాం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీలు పూర్తి కావాలి



జగనన్న కాలనీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

సింహాచలం : రానున్న ఉగాది నాటికి జగనన్న కాలనీల నిర్మాణాలు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెందుర్తి మండలంలోని ముదపాకలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని జేసీ విశ్వనాథంతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇస్తుందన్నారు. అందులో భాగంగా ముదపాకలో ఫేజ్-1లో 270 ఎకరాలు, ఫేజ్-2లో 50 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 6028 ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులు స్వచ్ఛందగా వచ్చి 5080 ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు.

చదువు చెప్పి..శిక్షణ ఇచ్చి..

- అనాథలకు అండగా బాలుర గృహం
- 18 ఏళ్ల వరకూ సంరక్షణ
- చేతి వృత్తుల్లో శిక్షణతో ఉపాధి



ప్రభుత్వ బాలుర గృహం

ఆరిలోవ : దారితప్పిన బాలురు కోసం.. అల్లరిచిల్లరిగా తిరిగే వీధి బాలలకు.. తల్లిదండ్రులు మాట వినని వారిని..బాలురు గృహం అక్కున చేర్చుకొంటోంది. వారికి విద్యాబుద్ధులు నేర్పించి, మంచి నడవడికతో బాహ్య ప్రపంచంలోకి పంపిస్తోంది. చేతి వృత్తుల్లో శిక్షణ ఇచ్చి వారి కాళ్లమీద వారు నిలబడేటట్టు చేస్తోంది...ఆరిలోవ ప్రాంతం దీనదయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర గృహం.

ఈ గృహంలో 100 మంది బాలురు ఉండవచ్చు. ప్రస్తుతం ఇక్కడ 43 మంది పిల్లలున్నారు. వీరంతా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలు, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారూ ఉన్నారు. వీరంతా 18 ఏళ్లలోపు వాళ్లే. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్కూల్ నిర్వహిస్తున్నారు. 8 నుంచి 10 వరకు హైస్కూల్‌కు పంపిస్తున్నారు. మరికొందర్ని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయిస్తున్నారు. దీంతో పాటు బయటకు వెళ్లిన తర్వాత వారికాళ్లమీద వారు నిలబడడానికి చేతి వృత్తుల్లో శిక్షణ కూడా ఇస్తున్నారు.

ఏడు జిల్లాలకు చెందిన...

ఏడు జిల్లాల్లో ఎక్కడైనా బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌లపై అనాథలుగా తిరిగే 10 ఏళ్లలోపు బాలురును ఇక్కడ చేర్చుతారు. అలాంటి వారిని ఆయా జిల్లాల నుంచి ఎవరైనా ఇక్కడకు తీసుకురావచ్చు. ఇక్కడ చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ వారిని విచారించి ఈ గృహంలో చేర్చుకొంటారు. దీంతో పాటు తల్లిదండ్రులు మాటవినని బాలురును, తల్లిదండ్రులను కోల్పోయినవారిని కూడా చేర్పించవచ్చు. 18 ఏళ్లు వచ్చే వరకు విద్యాబుద్ధులు చెప్పి.. చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తారు. 18 ఏళ్లు దాటిన వెంటనే గృహం నుంచి బయటకు పంపుతారు. బయటకు వెళ్లిన తర్వాత వారు జీవనోపాధిలో స్థిరపడడానికి ఇక్కడ శిక్షణ పొందిన చేతి వృత్తులు ఉపయోగపడతాయి.



బ్యాగులు తయారీకి కొలతలు, కటింగ్ నేర్పుతున్న ఇన్‌స్ట్రక్టర్ నాగమణి



తయారు చేసిన బ్యాగులు

చేతి వృత్తుల్లో శిక్షణ..

ఇక్కడ బాలురకు పలు చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తుంటారు. టైలరింగ్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్స్, ప్లంబింగ్, కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లిష్ విభాగాలలో శిక్షణలు ఇస్తుంటారు. ప్రస్తుతం జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ బాలురకు జ్యూట్ బ్యాగులు తయారీలో మూడు నెలలు శిక్షణ ఇస్తున్నారు. నవంబరు 29 నుంచి జరుగుతున్న ఈ శిక్షణలో 20 మంది బాలురు బ్యాగుల తయారీలో నిమగ్నమయ్యారు.



తయారు చేసిన బ్యాగులతో బాలురు

వాటికి కావాల్సిన మెటీరియల్ వారే తీసుకొచ్చి ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్ ద్వారా బాలురకు శిక్షణ ఇస్తున్నారు. గతంలో టైలరింగ్‌లో షర్టు, ప్యాంటు కుట్టడం, దుస్తులు కత్తిరించడంలో సులువైన మార్గంలో శిక్షణ ఇచ్చారు. ఎలక్ట్రికల్‌లో వైరింగ్ చేయడం, విద్యుత్ దీపాలు వెలిగించడం, మొరాయించిన ఫ్యాన్‌లను బాగుచేయడం నేర్పించారు. ఇక్కడ శిక్షణ పొందిన అనంతరం 18 ఏళ్లు దాటినవారు బయటకు వెళ్లి ఉద్యోగాలు కూడా చేస్తున్నారని గృహం అధికారులు చెబుతున్నారు.

బ్యాచ్‌లవారీగా శిక్షణ



బాలుర గృహంలో చదువుతో పాటు చేతి వృత్తుల్లో శిక్షణలు ఇస్తున్నాం. ఇక్కడ వీధిబాలురుంటారు. వారిని 18 ఏళ్లు దాటిన తర్వాత బయటకు పంపిస్తాం. అప్పటి నుంచి వారు తమ కాళ్ల మీద నిలబడడానికి ఈ శిక్షణ పనిచేస్తుంది. చాలామంది బయట కంపెనీలు, పెద్ద షాపులులో పనిచేస్తున్నారు. ప్రస్తుతం జ్యూట్ బ్యాగుల తయారీలో జనశిక్షణ సంస్థ శిక్షణ ఇస్తోంది. మొదటి బ్యాచ్ కొనసాగుతోంది, తర్వాత మిగిలిన బాలురకు బ్యాచ్ ప్రారంభం కానుంది. పిల్లల్లో మంచి ప్రవర్తన కలిగించడానికి ఇలాంటి శిక్షణలు ఉపయోగపడతాయి.

-కె.వీరయ్య, బాలుర గృహం సూపరింటెండెంట్

సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాలు అందుబాటు లోకి తీసుకొచ్చారు. సచివాలయాల్లోనే ఆధార్ సేవలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొన్నారు. తూర్పు నియోజకవర్గం రెండు జోన్ల పరిధిలో ఉంది. జీవీఎంసీ జోన్-2, జోన్-3 పరిధిలో 15 వార్డులున్నాయి. జోన్-2 పరిధిలో 9, 10, 11, 12,13 వార్డులున్నాయి. జోన్-3 పరిధిలో 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 28 వార్డులున్నాయి. రెండు జోన్ పరిధిలో 16 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవడానికి, ఇప్పటికే ఆధార్ కార్డులు కలిగి ఉన్నవారిలో ఏమైనా తప్పులు దొర్లినవారు, ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.

- జోన్-2లో ఆరిలోవ కాలనీలో 4, 12, సచివాలయాలు, గాంధీనగర్-1లో 13వ నంబరు సచివాలయం, ఆరిలోవ-5లో 18వ నంబరు సచివాలయం-బాలాజీనగర్-3లో 21వ నంబరు సచివాలయం, సంజయ్‌గాంధీకాలనీ-1లో 29వ నంబరు సచివాలయం, సంజయ్‌గాంధీ కాలనీ-2లో 06వ నంబరు సచివాలయంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.
- జోన్-3లో న్యూరేసపువానిపాలెంలో 106, రజకవీధిలో 110, మద్దిలపాలెం-3లో 117, లలితానగర్‌లో 125 నంబరు సచివాలయం, పాతరేసపువానిపాలెంలో 138 నంబరు సిచివాలయం, పిఠాపురంకాలనీలో 149 నంబరు సచివాలయం, బాలాజీనగర్ (పెదవాల్తేరు)లో 150 నంబరు సచివాలయం, ఇందిరానగర్ (లాసెన్స్‌బేకాలనీ)
- 3లో 154 నంబరు సచివాలయం, రెల్లిపేటలో 163 నంబరు సచివాలయంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

నియోజకవర్గంలో ప్రజలు ఆధార్ కేంద్రాలను సద్వినియోం చేసుకోవాలి. వార్డుల్లో ఉండే సచివాలయాలలోనే వటిని సిద్ధం చేశాం. ఇవి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు ఈ నెల 24 వరకు ప్రత్యేక డ్రైవ్ కూడా ఆయా సచివాలయాల్లో నిర్వహిస్తున్నాం. ఆధార్ కొత్తగా నమోదు చేసుకోవడంతో పాటు తప్పులు సవరణ, అప్‌డేట్ చేయించుకోవచ్చు.

-కనకమహాలక్ష్మి, జెడ్సీ, జోన్-2, మధురవాడ

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించండి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూక్యాంపస్: జ్ఞానాన్ని సముపార్జించడం ఎంత ముఖ్యమో ఆ జ్ఞానాన్ని విద్యార్థులకు పంచడం అంతే అవసరమని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. శనివారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో ఉన్నత విద్య మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తగా నిర్వహించిన 21వ శతాబ్దపు నైపుణ్యాలు-బోధన పద్ధతుల సదస్సు ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులకు వర్తమాన జ్ఞానాన్ని అందించే ప్రక్రియలో విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. 21వ దశాబ్దంలో బోధన పద్ధతులను నవీకరించుకుని వాటిని విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉపయుక్తంగా అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. నూతన విద్య విధానంలో వచ్చిన మార్పులను ఆకళింపు చేసుకుంటూ వీటిని అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెనర్ దినకర్ రెడ్డి, కార్యక్రమ గౌరవ అతిథి హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకట కృష్ణ, కార్యక్రమ సంచాలకులు ఆచార్య ఎస్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వర్కుషాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట శేషయ్య



జంతువుల ఎన్‌క్లోజర్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఎంవీపీకాలనీ : వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రొఫెసర్ వెంకట శేషయ్య అన్నారు. ఏపీలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అటవీశాఖ అధికారుల కోసం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో నిర్వహిస్తున్న వర్కుషాప్ 2వ రోజు కొనసాగింది. 2వ రోజు కార్యక్రమంలో భాగంగా జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు పలు రకాల జునోటిక్ వ్యాధులను నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట శేషయ్య మాట్లాడుతూ జంతువుల్లో వ్యాపించే వ్యాధుల నిర్ధారణ, శాంపిల్స్ సేకరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దీంతో పాటు మృతి చెందిన జంతువులను పరీక్షించే విధానం, వాటి అంత్యక్రియల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జూలోని పలు జంతువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం వర్క్‌షాపునకు హాజరైన ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పలు జంతువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమజతో పాటు జూ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఏసీఎఫ్ మంగ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి 'హ్యూమన్ జెనిటిక్స్' అంతర్జాతీయ సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నంచి 25వ తేదీ వరకు విభాగ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షుడు ఆచార్య జి.పద్దయ్య తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా 'న్యూ జెనిటిక్స్ అండ్ ఇట్స్ కాంట్రిబ్యూషన్స్ టు హ్యూమన్ హెల్త్ అండ్ వెల్త్' అంశంపై సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్ 47వ వార్షిక సమావేశం నిర్వహిస్తామన్నారు. సదస్సుకు విభాగ పూర్వవిద్యార్థులు, ఈ రంగంలో నిపుణుల హాజరవుతారన్నారు. సదస్సులో భాగంగా నోబెల్ గ్రహీత డాక్టర్ గ్రెగ్ సెమెంజా వర్చువల్ విధానంలో కీలకోపన్యాసం చేస్తారని సదస్సు కన్వీనర్ ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. సదస్సులో అమెరికా, యూరప్ దేశాల నుంచి జెనిటిక్స్, కాన్సర్ వంటి అంశాలపై పరిశోధనలు జరిపే ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరవుతున్నారన్నారు. సదస్సుకు 500 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఏయూ ఉద్యోగులకు స్థానం



శంకర్ రెడ్డి, గోవిందులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఏయూక్యాంపస్: విశ్వవిద్యాలయాల ఉద్యోగుల రాష్ట్రసంఘంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉద్యోగులకు స్థానం కల్పించారు. ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఆంటియా) ఎన్నికలు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 సంఘాలకుగాను 19 సంఘాలు ఈ సమావేశ ఎన్నికలకు హాజరైన రాష్ట్ర ఉద్యోగులు ఏక గ్రీవంగా అధ్యక్షుడిగా వెంకటప్పారెడ్డి (నాగార్జున యూనివర్సిటీ), జి సురేంద్ర బాబు (రాయలసీమ యూనివర్సిటీ), ఉపాధ్యక్షుడిగా బొట్ట గోవింద్ (ఆంధ్ర యూనివర్సిటీ), క్రీడల విభాగం కార్యదర్శిగా పిడింట్ల శంకర్ రెడ్డి (ఆంధ్ర యూనివర్సిటీ), కోశాధికారిగా షేక్ అహ్మద్ బాషా (అగ్రికల్చర్ యూనివర్సిటీ), గౌతమ్ నాయుడు (నన్నయ్య యూనివర్సిటీ) ఎన్నుకొన్నారు. ఏయూకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి నాయకత్వంలో స్థానం కల్పించడంపై ఏయూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొట్ట గోవింద్, పిడింట్ల శంకర్ రెడ్డిలను సత్కరించారు.

ఎన్నెన్నో అందాలు..పుష్పాల వర్ణాలు



ఫ్లెరోమా పుష్పాలు



డయాంథస్



దాలియా



గజానియా



రైతుబజార్‌లో నర్సరీలో పూల మొక్కలు

ఏయూక్యాంపస్: శీతాకాలంలో విభిన్న రకాలు పుష్పాలు విరివిగా కనిపిస్తాయి. పెదవాల్తేరులోని రైతుబజార్ ఆవరణలో ఉన్న నర్సరీలో విభిన్న రంగుల పుష్పాలతో మొక్కలు విక్రయిస్తున్నారు. చామంతి, బంతి రకాలతో పాటు దాలియా, ఫ్లెరోమా, డయాంథస్, గజానియా వంటి విభిన్న జాతుల మొక్కలు ఇక్కడ విక్రయిస్తున్నారు. ఒక్కో మొక్క రూ.50కి విక్రయిస్తున్నారు. రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు ముచ్చటపడి ఈ మొక్కలను కొనుగోలుచేస్తున్నారు.

23న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్: నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవీ కల్యాణ మండపం సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, నగరంలో గల అన్ని వాసవీక్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ సంఘ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. ఆ రోజు వేకువజాము 3 గంటలకు మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక ఆత్మార్పణ అలంకరణ ఉంటాయన్నారు. 8 గంటలకు భక్తులచే ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, 8.30కి స్వర్ణపుష్ప పూజ, సహస్రనామార్చన, 9.30 గంటలకు మహిళలచే సామూహిక సహస్రనామ పారాయణ, 10.30కి వాసవీ హోమం, మధ్యాహ్నం 12 గంటల నుంచి నారాయణ సేవ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆత్మార్పణ దినం అంటే..

భరతభూమిపై జన్మించిన ఆదర్శమూర్తుల్లో ఒకరైన జగన్మాత, అవతార స్వరూపిణి ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీమాత 1013 ఏళ్ల కిందట కాముకుడైన విష్ణువర్ధనుని కామతృష్ణను జయించేందుకు ధర్మాన్ని ఆయు. దంగా చేసుకుని ధర్మరక్షణకు వైశ్య జాతిని జాగృతపరచి తనతో పాటు 102 మంది ఆర్యవైశ్య దంపతులతో మాఘ శుద్ధ విధియ రోజున ఆత్మార్పణ చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆ రోజున ఆత్మార్పణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అరిశెట్టి దినకర్ తెలిపారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని 102 నమూనా అగ్నిగుండాలు, 102 మంది దంపతులు, 102 పువ్వుల బుట్టలు, 102 దీపాలు, 102 రకాల ప్రసాదాలతో దేవాలయంలో సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్యక్రమ చైర్మన్ జీవీఆర్ కుమార్, చెక్కా చందన తెలిపారు.

24న పోలమాంబ జాతర



ఉత్సవాల రాట వేస్తున్న ముత్తైదువులు



పోలమాంబ అమ్మవారు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు పరిధి కుమ్మరవీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ 65వ వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 23, 24 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం రాట కార్యక్రమం నిర్వహించారు. పలువురు ముత్తైదువులు రాట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నెల 23న తొలేళ్ల సంబరం జరపనున్నారు. 24న పరస మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తైదువులతో ఘటాభిషేక ఉత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పుర వీధుల గుండా ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పౌరాణిక వేషధారణలు, సాముగరిడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25 మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి పరస మహోత్సవంలో పాల్గొనాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్

దొండపర్తి : సోషల్ మీడియా ప్లాట్‌ఫాం అయిన క్లబ్ హౌస్‌లో యువతితో తప్పుగా మాట్లాడి అగౌరవపరిచిన ఇళ్ల భవానీ శంకర్‌ను సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి గ్రామానికి చెందిన పిల్ల భవానీశంకర్ (26) క్లబ్‌హౌస్ ప్లాట్‌ఫారంలో యువతిని ప్రైవేట్ అకౌంట్‌లో యాడ్ చేశాడు. కొంత కాలం మాట్లాడిన తరువాత భవానీశంకర్ సదరు యువతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి ఆమె గౌరవానికి భంగం కలిగించాడు. దీంతో ఆమె సైబర్ పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తు చేపట్టిన సీఐ భవానీప్రసాద్ నిందితుడు భవానీశంకర్ అత్తిలి గ్రామంలో ఉన్నట్లు గుర్తించి సిబ్బందిని అక్కడికి పంపించి అరెస్టు చేయించారు. శుక్రవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

గిరిజన భాషలపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన భాషలపై రుషికొండలో గల గిరిజన భవన్‌లో శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడే కోయ, సవర, ఆదివాసీ ఒరియా, జాతపు, కువి, కొండదొర భాషలు వంటి లిపి లేని గిరిజన భాషలను నిర్మించిన ఎంటీవీ - ఎంఎల్ఈ ఉపాధ్యాయ శిక్షణ మాడ్యూళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో మాతృభాష ఆధారిత బహు భాష విద్యను సమగ్ర విద్య, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి ఈ వర్క్‌షాప్ కృషి చేస్తుందన్నారు. బోధన, అభ్యాసం, నైపుణ్యం, అభివృద్ధి, పిల్లల అభ్యాస అలవాట్లు అంచనా వేయడం, ప్రాథమిక స్థాయిలో లేదా మాతృభాషలో చదవడం, ఇతర భాషల సహాయంతో విద్యారంగాన్ని బలోపేతం చేసే అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల అభ్యాసాల కార్యకలాపాలను నేరుగా అమలు చేయడానికి ఈ మాన్యువల్ ఉపాధ్యాయులకు సహాయపడుతుందన్నారు.